ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 1 సెప్టెంబరు 2025





శ్రీకాకుళం నాగావళి నదిలో వినాయక విగ్రహాల నిమజ్జనం

జై.. జై.. వినాయక

శ్రీకాకుళం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉత్సవాలు ప్రారంభమై ఐదురోజులు పూర్తికావడంతో జిల్లాలో చాలాచోట్ల విగ్రహాలను ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. శ్రీకాకుళంలోని దమ్మలవీధి, గుడివీధి తదితర మండపాల్లో కొలువైన వినాయక విగ్రహాలను ఊరేగించారు. మహిళలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. మేళతాళాలతో నృత్యాలు చేస్తూ.. నాగావళి నది వద్దకు ఊరేగింపుగా చేరుకుని.. అక్కడ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.





విజయగణపతికి పుష్పాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో ఆదివారం స్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విజయగణపతిని దర్శించుకున్నారు. మల్లెలు, కనకాంబరాలు, గులాబీలు, బంతిపూలతో వైభవంగా పూజలు చేశారు.

వీఆర్‌కు ఇద్దరు ఎస్‌ఐలు

- అవినీతి అక్రమాలపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు?
- చర్యలకు ఉపక్రమించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమాలకు పాల్పడే పోలీసు లపై చర్యలకు ఎస్పీ మహేశ్వరరెడ్డి శ్రీకారం చుట్టారు. ఆదివారం పాతపట్నం నియోజక వర్గంలో ఇద్దరు ఎస్‌ఐలను ఒకేసారి వీఆర్(వేకెంట్ రిజర్వ్)కు పంపే శారు. వివరాల్లోకి వెళ్తే.. పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు ఎస్‌ఐగా ఎండీ అమీర్ ఆలీ గతేడాది నవంబర్‌లో విధుల్లో చేరారు. హిరమండలం ఎస్‌ఐ యండీ యాసిన్ గతేడాది బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలు గడిచాక వంశధార నది నుంచి ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో ఈ ఇద్దరి ఎస్‌ఐలపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. సరిహద్దు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి.. స్వాధీనం చేసుకున్న డబ్బులు స్వాహా చేసి.. కొంత మందిపై కేసుల్లేకుండా చేశారని ఆరోపణలు న్నాయి. వారి అవినీతిపై పక్కా ఆధారాలతో స్థానిక ప్రజాప్రతినిధులు, కీలక కూటమి నాయకులు మంత్రి నారా లోకేశ్‌కు, ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఇద్దరు ఎస్‌ఐలను వీఆర్‌కు పంపేస్తూ.. ఎస్పీ ఝలక్ ఇవ్వడం పోలీసుశాఖలో ఒక్కసారిగా చర్చనీయాంశమైంది. ఇన్నాళ్ల నాయకుల అండ ఉంటే చాలు అనుకున్న వారందరికీ... ఓ హెచ్చరిక అన్న సంకేతాలను జిల్లా పోలీసు బాస్.. వీఆర్ పేరుతో జారీచేశారని పలువురు పేర్కొంటున్నారు.

- హిరమండలం ఎస్‌ఐ యాసిన్.. వైసీపీ హయాంలో కూడా పాతపట్నం నియోజకవర్గంలో విధులు నిర్వహించారు. మళ్లీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలోనూ అదే నియోజకవర్గంలో మరో మండలంలో పోస్టింగ్ తెచ్చుకున్నారంటే ఆయన లాబీయింగ్‌ను అర్థం చేసుకోవచ్చు.

- కొత్తూరు ఎస్‌ఐ అమీర్ ఆలీ.. సివిల్ వ్యవహారాల్లో జోక్యం.. పేకాట స్థావరాల్లో పట్టుబడిన నగదు లెక్కచెప్పే విషయంలోనూ తేడా చూపించడం... ఇసుక ర్యాంప్‌ల నుంచి మామ్మూళ్లు.. జూన్‌లో సంభవించిన కారు ప్రమాద ఘటనలోనూ, గూనభద్రలో పేకాట స్థావ రంపై దాడి చేసి.. కేసు నమోదు చేయలేదన్న ఆరోపణ లున్నాయి. శోభనాపురం క్వారీ వద్ద ఓ వ్యక్తిని తీవ్రంగా చితకబాదినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎప్పుడు పూర్తవుతుందో?

- వంశధార నదిపై అసంపూర్తిగా వంతెన నిర్మాణం
- గార-పోలాకి మండలాల ప్రజలకు ఇబ్బందులు

5 లో



చిల్లపేటరాజాంలో అసంపూర్తిగా వెల్‌నెస్ సెంటర్

- గ్రామాల్లో అసంపూర్తిగా ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాలు
- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

జిల్లాలో మొత్తం ప్రభుత్వ భవనాలు	2,046
నిర్మాణాలు పూర్తయినవి	828
అసంపూర్తిగా ఉన్నవి	647
పనులు ప్రారంభించనివి	571

647 భవనాల పరిస్థితేంటి?

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారు 30 ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. రణస్థలం మండలానికి 27 గ్రామ సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. ఇందులో 18 భవనాల నిర్మాణం పూర్తయింది. 9 భవనాలను అసంపూర్తిగా వదిలేశారు. జి.సిగడాం మండలంలో 21 సచివాలయ భవనాలు పూర్తికాగా 5 అసంపూర్తిగా ఉన్నాయి. లావేరు మండలంలో 16 సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. 7 అసంపూర్తిగా ఉన్నాయి. ఎచ్చెర్ల మండలంలో 20 సచివాలయాల నిర్మాణాలు పూర్తికాగా.. 8 భవనాలను అలానే వదిలేశారు.

రణస్థలం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):

జిల్లావ్యాప్తంగా ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 647 ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా వదిలేశారు. అవి ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితి. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలే భవనాల పనులు చేపట్టగా.. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో నిలిపేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తామన్నా.. పనులు పూర్తిచేసేందుకు వారు ముందుకు రాకపోవడం గమనార్హం. ప్రతిపక్షంలో ఉండడంతో బిల్లులు చెల్లిస్తారో.. లేదోనన్న అనుమానమే ఇందుకు కారణం. కాగా.. ఈ భవనాలు పూర్తికాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. మరోవైపు ప్రైవేటు భవనాల్లో సచివాలయాలు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వానికి అద్దె బాధ తప్పడం లేదు.

● ఇదీ పరిస్థితి..

వైసీపీ ప్రభుత్వం గ్రామస్థాయిలో అన్నిరకాల ప్రభుత్వ సేవలను అందించాలనే ఉద్దేశంతో 2019 అక్టోబరు 2న సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. అలాగే సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ గ్రంథాలయ భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. కాగా.. ఐదేళ్ల పాలనలో వీటి నిర్మాణాలను పూర్తిచేయలేకపోయింది. కొన్నింటి నిర్మాణం పూర్తయినా వినియోగించడం లేదు. దీంతో అవి నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాస్తవానికి ఈ భవనాలను కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మించతలపెట్టారు. ఒక్కో సచివాలయానికి రూ.45లక్షలు, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలు, డిజిటల్ గ్రంథాయాల నిర్మాణానికి రూ.25లక్షలు చొప్పున కేటాయించారు. జిల్లాలో మొత్తం 2,046 భవనాలకు సంబంధించి రూ.641కోట్లతో పనులు ప్రారంభించారు. ఐదేళ్లలో రూ.325కోట్ల వరకూ ఖర్చుచేసి 828 భవనాలను మాత్రమే పూర్తిచేశారు. 647 భవనాలను అసంపూర్తిగా వదిలేశారు. 571 భవనాల పనులు అసలు ప్రారంభానికి నోచుకోలేదు.

● ఒక్కటి కూడా కట్టలే..

ఉమ్మడి జిల్లాకు తొలి విడతగా 195 డిజిటల్ గ్రంథాలయ భవనాలు మంజూరయ్యాయి. తొలి విడతగా 2022 ఉగాదికి, రెండో విడత అదే ఏడాది డిసెంబరుకు, మూడో విడత 2023 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించారు. చాలాచోట్ల పనులు ప్రారంభించారు కానీ ఒక్కచోట కూడా పూర్తికాలేదు.

● అంతటా అస్పష్టత..

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా.. సచివాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తిచేయడం లేదు. నిర్మించినవి కూడా ప్రారంభించడం లేదు. వైసీపీ సర్పంచ్‌లు, ఇతర నేతలు వీటి నిర్మాణ (మిగతా 5వ పేజీలో..)

వైభవంగా ఏకాదశ రుద్రపారాయణం 6 లో

రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మ 6 లో

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి 5 లో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి 5 లో

బంగారం కొరియర్ అదృశ్యం

- ఈనెల 26న రూ.2కోట్లతో విశాఖపట్నం వెళ్లి తిరిగి రాని వైనం
- శ్రీకాకుళం వచ్చే బస్సులో సెల్‌ఫోన్ లభ్యం
- పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు



పొట్నూరు గుప్త (ఫైల్)

నరసన్నపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటకు చెందిన ఓ బంగారం కొరియర్ అదృశ్యమయ్యారు. ఈ నెల 26న కారులో విశాఖపట్నం వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసన్నపేటలోని లచ్చుమన్నపేటకు చెందిన పొట్నూరు గుప్త ఈ నెల 26 నుంచి కనిపించడం లేదని సోదరుడు మన్మథరావు ఆదివారం నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొంత కారులో పురుషోత్తనగర్‌కు చెందిన ఒక డ్రైవర్‌ను తీసుకుని గతనెల 26న గుప్త విశాఖపట్నం వెళ్లారు. కారును డ్రైవర్‌తో నరసన్నపేట పంపించేశారు. ఆ రోజు నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా ఈ నెల 28న విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వచ్చే ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడికి ఆ ఫోన్ లభ్యమైంది. ఆ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాం. కానీ, (మిగతా 6వ పేజీలో..)



రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచిన బాలబాలికలు

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో సత్తా

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా బాలబాలికలు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో ద్వితీయస్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించి సిక్కోలు సత్తాచాటారు. ప్రకాశం జిల్లా చేవూరు మండలం రామదూత ఆశ్రమం వేదికగా గత మూడు రోజుల నుంచి నిర్వహించిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో జిల్లా జట్లు రెండు మెరుగైన స్థానాలు సాధించడం గొప్పవిషయమని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోత పూర్ణచంద్రరావు, పీవీజీ కృష్ణంరాజు తెలిపారు. క్రీడాకారులను సంఘం చైర్మన్ సూర శ్రీనివాసరావు, ప్రతినిధులు పి. అజయ్‌కుమార్, బీహెచ్.అరుణ్‌కుమార్, యానాల తారకేశ్వరరావు, కోడి మోహన్‌రావు, బి.సాయి అభినందించారు.



బెల్లుపడ పట్టణ ఆరోగ్య కేంద్రం

పట్టణ ఆరోగ్య కేంద్రాలకు కొత్తరూపు

- మెరుగుపడిన వసతులు
- అందుబాటులో 30 రకాల వైద్యసేవలు
- పెరుగుతున్న ఓపీ సంఖ్య

ఇచ్ఛాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేస్తోంది. అన్నిరకాల సౌకర్యాలు మెరుగుపరుస్తోంది. అవసరమైన మంచాలు, మందులను అందుబాటులో ఉంచుతోంది. ల్యాబ్‌ల్లో వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తోంది. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ కేంద్రాలకు ప్రస్తుతం కొత్తరూపు వచ్చింది. ఓపీ సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇదీ పరిస్థితి..

పట్టణాల్లో నిరుపేదలు, మురికివాడల ప్రజల కోసం పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబంధించి శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 6, ఇచ్ఛాపురంలో 2, పలాస-కాశీబుగ్గ 3, ఆమదాలవలస మునిసిపాలిటీలో 2 మొత్తం 13 కేంద్రాలు ఉన్నాయి. ప్రతీ 3 వేల కుటుంబాలకు ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఆరోగ్య కేంద్రాల నిర్వహణలో పూర్తిగా విఫలమైంది. మందులు సకాలంలో వచ్చేవి కావు. ఆస్పత్రుల నిర్వహణను కూడా గాలికొదిలేసింది. ఈ తరుణంలో రోగులకు అరకొర సేవలు అందేవి. గతంలో చిన్నపాటి రోగాలకు సైతం ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో వైద్యం భారంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కష్టాలన్నీ తీరుతున్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అదనపు వసతులు సమకూర్చుతోంది. టెలీ మెడిసిన్, ప్రత్యేకంగా మంచాల ఏర్పాటు, రిఫరల్ కేసులు తగ్గించడం వంటి వాటిపై దృష్టిపెట్టింది. 30రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు కూడా జరుగుతున్నాయి. దీంతో దాదాపు అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అవుట్ పేషెంట్ విభాగం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు సగటున ఈ 13 కేంద్రాల్లో 900 నుంచి 1200మంది రోగుల వరకూ వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ఒక్కో కేంద్రంలో రోజుకు 20 నుంచి 30 మంది రోగులకు మాత్రమే వైద్యసేవలు అందేవి. ఇప్పుడు అదనపు సదుపాయాలు కల్పించడం, ల్యాబ్ వసతి పెరగడం, మందులు సైతం అందుబాటులోకి (మిగతా 5వ పేజీలో..)

క్రీడా వసతుల కల్పనకు చర్యలు: ఎమ్మెల్యే శంకర్



కల్యాణ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాకారులకు అవసరమైన వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా పాత్రునివలస వద్ద 30 ఎకరాల్లో అన్ని క్రీడాంశాలను కలిపి క్రీడా హబ్‌గా తయారు చేసేందుకు సంకల్పించినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తిరుపతిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ రికర్వ్ విభా గంలో విజేతగా నిలిచిన ఆరంగి కల్యాణ్‌ను ఆదివారం పార్టీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా కల్యాణ్ అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. సీతం పేట వంటి ట్రైబల్ ప్రాంతాలకే పరిమితమైన ఆర్చరీ నేడు పట్టణంలో అర్జున ఆర్చరీ అకాడమీ క్రీడాకారులకు ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పీఎంజే బాబు, కోచ్ శ్రీనివాసరావు ఆర్చరీ అకాడమీ అధ్యక్షుడు ఎం.రమేష్, కార్యదర్శి చిట్టిబాబు, పి.కృష్ణప్రసాద్, ఓ.శ్రీనివాసరావు, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

647 భవనాల పరిస్థితేంటి?

(మూడో పేజీ తరువాయి)

బాధ్యతలు చూసేవారు. వైసీపీ ప్రభుత్వం అప్పట్లో బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించింది. కానీ, అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసేందుకు మాత్రం వైసీపీ ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు కొద్దిరోజులే ఉండడంతో తరువాత చూద్దాంలే అన్నట్లు కూటమి నేతలు ఉన్నారు. దీంతో 647 భవనాలకు సంబంధించి ఎటూ పాలుపోవడం లేదు. దీంతో ప్రతి గ్రామంలో ఈ భవనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వీటి నిర్మాణాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

త్వరలో పూర్తిచేస్తాం..

సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలకు సంబంధించి భవనాల నిర్మాణం పూర్తిచేయడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే పెండింగ్ బిల్లులు సైతం చెల్లించింది. నిర్మాణాలు పూర్తిచేసిన వాటిని అందుబాటులోకి తీసుకొస్తాం. త్వరగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చేస్తాం.

-జి.రవి, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్‌ఈ, శ్రీకాకుళం

దిష్టి బొమ్మల్లా..

గ్రామంలో ఈ భవనాలు అసంపూర్తిగా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వైసీపీ ప్రభుత్వ వృథా చేసింది. కూటమి ప్రభుత్వం వీటి విషయంలో ప్రత్యేకంగా దృష్టిసారించాలి.

-కెల్ల హేమంత్ కుమార్, రణస్థలం

కాలయాపన చేశారు..

మా గ్రామంలో సచివాలయ నిర్మాణానికి అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారు. పాలకేంద్రం భవనంలో సచివాలయం నిర్వహిస్తున్నారు. సచివాలయ నిర్మాణం పూర్తిచేసి.. అందుబాటులోకి తేవాలి.

-బసవ గోవిందరెడ్డి, కొచ్చెర్ల

పట్టణ ఆరోగ్య కేంద్రాలకు కొత్తరూపు

(మూడో పేజీ తరువాయి)

రావడంతో రోజుకు 60 నుంచి 70 మంది రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

చురుగ్గా సర్వే..

ప్రస్తుతం పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో దీర్ఘకాలిక వ్యాధులపై చురుగ్గా సర్వే జరుగుతోంది. ప్రతీ కేంద్రం పరిధిలో 3 వేల మంది జనాభా ఉన్నారు. వీరిలో ఎంతమంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్నారు? ఎవరైనా బీపీతో బాధపడుతున్నారా? సుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారా? చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎటువంటి వ్యాధులతో బాధపడుతున్నారు? అని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే ప్రక్రియ ఆధారంగా దీర్ఘకాలిక రోగుల విషయంలో పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరింత చొరవ చూపుతారు. వారికి నిత్యం వైద్య పరీక్షలు చేసి పర్యవేక్షిస్తారు.

ఓపీ పెరిగింది..

ఇచ్ఛాపురంలోని బెల్లుపడ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో రోజువారీ ఓపీ 50కి పైగా పెరిగింది. రోగులకు కావల్సిన మందులు అందుబాటులో ఉన్నాయి. ఒకవేళ అత్యవసర మందులు అవసరమైతే వెంటనే దగ్గర్లో ఉన్న సీహెచ్‌సీలో కానీ రిమ్స్‌లో కానీ తెచ్చి ఇస్తున్నాం. ప్రస్తుతం రూ20.లక్షల విలువ చేసే మందులు అందుబాటులో ఉన్నాయి. ఉత్తమ పట్టణ ఆరోగ్య కేంద్రంగా రాష్ట్రంలోని ఒక్క ఇచ్ఛాపురం సెంటర్‌కే అవార్డు వచ్చింది. ఉత్తమ ఫార్మాసిస్ట్ ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నాను.

-రఘు, ఫార్మాసిస్ట్, పట్టణ ఆరోగ్య కేంద్రం, బెల్లుపడ కాలనీ

సద్వినియోగం చేసుకోవాలి..

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సేవలు పెరిగాయి. అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఓపీ సంఖ్య కూడా పెరిగింది. రోగులకు అవసరమైన మందులు సైతం అందుబాటులో ఉన్నాయి. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-అఖిల్ మనోహర్, వైద్యాధికారి, యూపీహెచ్‌సీ, ఇచ్ఛాపురం

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

సోంపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిరిమామిడి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు జన్మభూమిని అభివృద్ధి చేయాలన్న ఆకాంక్షతో సిరిమామిడి బ్యూటిఫికేషన్స్ ప్రాజెక్టు పేరుతో ముందుకు వచ్చారు. గ్రామంలో ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. ఆదివారం గ్రామ ముఖద్వారం నుంచి పాఠశాల వరకు వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జుత్తు బాబూరావు, వెంకటేష్, పందిరి రమేష్, ప్రేమ్‌కుమార్, వెంకటేష్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్తలకు పురస్కార ప్రదానం

ఆమదాలవలస, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మునగవలస గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్త మావుడూరు అన్నాజీ శర్మకు జ్యోతిషరత్న అవార్డు లభించింది. ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతిభ కళా సాంస్కృతిక సంస్థ వివిధ రంగాల్లో పలువురు ప్రముఖులను సత్కరించింది. ఈ నేపథ్యంలో సీతంపేట ఐటీడీఏ గురుకుల పాఠశాలలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వహి స్తున్న అన్నాజీరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

నాగేశ్వర శర్మకు..

ఎచ్చెర్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జ్యోతిష పండితుడు, ఆధ్యాత్మికవేత్త పట్నాల నాగేశ్వర శర్మకు జ్యోతిషరత్న అవార్డు ప్రదానం చేశారు. అల్లినగరం పంచాయతీ ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన నాగేశ్వర శర్మకు విశాఖపట్నం ప్రతిభ క్రీడా, కళా సాంస్కృతిక సంస్థ ఈ అవార్డు అందించింది. ఈయనను పలువురు అభినందించారు.



పురస్కారాలు అందుకుంటున్న అన్నాజీశర్మ, శ్రీనివాస్, నాగేశ్వర శర్మ

ఎప్పుడు పూర్తవుతుందో?

- అసంపూర్తిగా వంశధారపై వంతెన నిర్మాణం
- గార-పోలాకి మండలాల ప్రజలకు ఇబ్బందులు



వంశధార నదిలో నిర్మించిన స్తంభాలు

గార, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వంశధార నదిపై గార, పోలాకి మండలం వనిత మండలం మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ వంతెన పూర్తయితే రెండు మండలాల ప్రజలు రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుంది. అయితే వంతెన పనులు ప్రారంభమై స్తంభాల దశలోనే నిలిచిపోవడం తో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు మండలాలను కలిపే ఈ వంతెన అవసరాన్ని గుర్తించి 2018లో రూ.72 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. పనులు చురుగ్గా సాగుతుండడం తో అప్పటిలో ప్రజలు కూడా ఆనందం వ్యక్తంచేశారు. 17 పిల్లర్లను ఏర్పాటు చేశారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డునిర్మాణానికి అడ్డంగా ఉన్న ప్రభుత్వ కార్యాల యాలు, ప్రైవేటు భవనాలకు మార్కెట్ విలువతో పరిహారం చెల్లించారు. అయితే ఆ తరువాత రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో వంతెన పనులపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. నాటి నుంచి ఇప్పటి వరకు పనులు పునః ప్రారంభం కాలేదు.

వంతెనపై అసెంబ్లీలో ప్రస్తావన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో వంతెన పనులపై ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రస్తావించారు. ఆ తరువాత శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి ఆర్అండ్‌బీ ఇంజనీర్లతో కలిసి అర్ధంతరంగా నిలిచిన పనులను పరిశీలించారు. అప్రోచ్ రోడ్డుకు అడ్డంగా ఉన్న భవనాలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈలోగా వర్షాలు కురవడం, నదిలో వరద నీరు ప్రవేశించింది. అయితే చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనుల్లో పురోగతి లేదని తెలుస్తోంది. సుమారు రూ.3 కోట్ల వరకు బిల్లు పెండింగ్‌లో ఉందని, బిల్లు చెల్లించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని సంబంధిత కాంట్రాక్టర్లు తెలిపినట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని వంతెన నిర్మాణం పూర్తి చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

జోరువాన..

ఇచ్ఛాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛా పురంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం గంట పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో మురికినీరు రోడ్లపైకి వచ్చి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆదిత్యుని ఆదాయం రూ.3.41 లక్షలు

అరసవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఒక్కరోజు స్వామికి రూ.3,41,052 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,33,500, విరాళాలు రూ.57,377, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,50,175 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆదిత్యుని సేవలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి జ్ఞాపికను ప్రధాన అర్చకులు వారికి అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు. అలాగే స్వామిని తమిళనాడు రాష్ట్రం కోవిల్‌పట్టి నియోజకవర్గం (చెన్నై) ఎమ్మెల్యే కడంబుర్ రాజు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చ కుడు ఇప్పిలి శంకర శర్మ స్వాగతం పలుకగా, ప్రసాదం, స్వామి వారి జ్ఞాపికను ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ అంద జేశారు.



హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రధాన అర్చకుడు శంకరశర్మ

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

అరసవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి డిమాండ్ చేశారు. యూనియన్ నగర మహాసభ ఆదివారం ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె ఫలితంగా 2024 జూలైలో వేతనాల పెంపునకు మినిట్స్ ఇచ్చారని, కానీ నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. గత ఆరేళ్లలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని, పని భారం కూడా పెరిగిందని, కాని వేతనాలు పెంచక పోవడంతో కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షురాలిగా కె.జ్యోతి, అధ్యక్షురాలిగా టి.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కె.కల్యాణి, ఉపాధ్యక్షులుగా పి.సంధ్యారాణి, కె.ఆది లక్ష్మి, జి.పావనిలను ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారాయణ మూర్తి, సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశ రావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలి

అరసవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని, నిరంతర వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. వార్షిక ఇంక్రిమెంట్స్, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, పరస్పర ఒప్పంద మరియు స్పష్టమైన ఖాళీల్లో బదిలీలు చేప ట్టాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.మాలతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీఎస్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా జి.సూర్య ప్రవీణ్, కోశాధికారిగా పి.ఉపేంద్ర, విమెన్స్ ప్రెసిడెంట్‌గా జి.కల్యాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.లక్ష్మిలను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గార/రూరల్ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణరావు అన్నారు. కె.మత్స్యలేశం యూపీ పాఠశాలకు విశ్రాంత రైల్వే ఉద్యోగి బొంది రమణ సమకూర్చిన కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను సుడా చైర్మన్ కొరికాన రవి కుమార్‌తో కలిసి ఏపీసీ ప్రారంభించారు. పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్‌ను సమకూర్చిన రమణను అభి నందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బుడ్డా ఎర్రన్న, ఈపీడీసీఎల్ చైర్మన్ చైతన్య, సంఘ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, పాఠశాల చైర్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.

'మణిపాత్రుని'కి 'తెలుగుతేజం' పురస్కారం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న కళావేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళానికి చెందిన మణిపాత్రుని నాగేశ్వరరావుకు తెలుగుతేజం పురస్కారం అందించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణ్ ఈ పురస్కారం అందించి అభినందించారు. అలాగే కళావేదిక ప్రధాన కార్యదర్శి డబ్బీరు గోవిందరావుకు, కార్యదర్శులు వాడాడ శ్రీనివాస్, కిమ్మి సంతోష్, ఐఎన్‌డీ ప్రసాద్‌కు, తాళ్యూరి విజయ లక్ష్మణ్‌కు కూడా పురస్కారాలు అందించారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా రాధారాణి జయంతి

రణస్థలం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాధారాణి జయంతి వేడుకలు శ్రీ కృష్ణ చైతన్య గోసేవ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు హరినామ సంకీ ర్తనలు చేశారు. రాధిక రమణ ప్రభు భగవద్గీత సారాంశం వివరించారు.

చౌదరి శ్రీనివాస్‌కు కళారత్న..

గార రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జొన్నలపాడు గ్రామానికి చెందిన చౌదరి శ్రీనివాస్‌కు కళారత్న పురస్కారం అందించారు. విశాఖపట్నంకు చెందిన ప్రతిభ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో ఆదివారం మాజీ మేయర్ దాడి సత్యనారాయణ జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. సత్సంగం, భక్తి గేయాలాపన, ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందించారు.

మాజీ ఎమ్మెల్యే 'దక్కత' సతీమణి కన్నుమూత

- ఎమ్మెల్యే అశోక్ పరామర్శ



ఆదిలక్ష్మి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే దివంగత దక్కత అచ్యుతరామయ్య రెడ్డి భార్య ఆదిలక్ష్మి (79) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆదిలక్ష్మి మృతి చెందిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆమె అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, నేతలు సహదేవ్‌రెడ్డి, డి.సూర్యనారాయణ, డి.కామేష్ తదితరులు ఉన్నారు.

'అంతర్మథనం' గ్రంథావిష్కరణ



అంతర్మథనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

ఆమదాలవలస, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ కవి కుప్పిలి వెంకట రాజారావు రచించిన 'అంతర్మథనం' వచన కవితా సంపుటిని ఆదివారం విశాఖపట్నం కళాభారతిలో ప్రముఖ గజల్ కళా కారుడు గజల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ప్రపంచ తెలుగు మహాసభల కవి సమ్మేళనం ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కవితలు మానవీయ విలువలు సామాజిక బాధ్యత ఆత్మ పరిశీలన వంటి అంశాలను ప్రతింబింబిస్తాయని శ్రీనివాస్ అన్నారు. సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



భాస్కర్ రావులో దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కంచిలి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని వక్తలు అన్నారు. మఠం సరియాపల్లి జడ్పీ ఉన్న త పాఠశాల హెచ్ఎం భాస్కర్ రావులో పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ఆయనను సత్కరించారు. భాస్కర్ రావులో దంపతులను ఎంఈవోలు సప్పటి శివరాం ప్రసాద్, ఎస్.విశ్వనాథం సత్కరించి అభినందించారు. కార్య క్రమంలో హెచ్ఎం పండా, ఇచ్ఛాపురం ఎంఈవో కె. అప్పారావు, యూటీఎఫ్ ప్రతినిధి బాబూరావు, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గార/రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఉపకేంద్రం ఆవరణలో 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్‌ను నూతనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో బూరవిల్లి నుంచి గార, కొర్ని, కొర్లాం, సతివాడ, మొగదాలపాడు, కొమరవానిపేట, వత్సవలస, తూలుగు, నిజామా బాద్, సతివాడ తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గార రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సురాల పాపారావు(55) ఆదివారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గొండు శంకర్ పరామర్శించారు. పాపారావు మృతదేహం వద్ద నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ కొయ్యాన జగదీష్, గంగు ప్రభాకర్ తదితరులున్నారు.

తురకపేటలో కార్డన్ సెర్చ్

సరుబుజ్జిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మూలసవలాపురం గ్రామ పంచాయతీ తురకపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐ బి.హైమవతి ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి ధ్రువ పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనా లను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామాల్లో ఉన్న మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్‌ను కాపాడుకోవాలని కోరారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

అరసవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విధుల్లో చేరి చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఏ కాలనీలోని కార్యా లయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక ఉత్తర్వులను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మంచి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉంగటి వెంకటరమణ, రాయిపల్లి అర్జున్, అంబటి లక్ష్మీరాజ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు దోహదం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వానికి, ఒత్తిడులను తగ్గించేందుకు క్రీడలు దోహదపడతాయని పోస్టల్ సూపరిం టెండెంట్ వండాన హరిబాబు అన్నారు. పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో 'ఫిట్ ఇండియా'లో భాగంగా ఆదివారం ఏడు రోడ్ల కూడలి ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా 'ప్రతిరోజు ఒక గంట మైదానంలో ఆడండి' అనే నినాదంతో ఫిట్ ఇండియా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఫిట్‌నెస్ కోసం ప్రతిజ్ఞ కూడా చేస్తు న్నట్లు పేర్కొన్నారు.

వినాయకుడికి ఘనంగా పూజలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వినాయకుడికి వైభవంగా పూజలు చేస్తున్నారు. విభిన్న రూపాల్లో కొలువైన గణనాథుడి లడ్డూలను వేలంలో సొంతం చేసుకోవడానికి పోటీలు పడుతున్నారు.


ఇచ్ఛాపురం: బహుమతులు అందజేస్తున్న ఎంఈవో


మహావిష్ణువుగా దర్శనమిస్తున్న వినాయకుడు


లడ్డూను దక్కించుకున్న కుమారస్వామి


నందిగాం: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నందిగాం కారిగుడ్డివీధి వినాయకుని వద్ద గార మండలం అంబలవలస గ్రామానికి చెందిన బృందంతో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మహావిష్ణువుగా గణపతి..

జలుమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొమనాపల్లిలో మహావిష్ణువు రూపంలో గణనాథుడు పూజలందుకుంటున్నాడు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.

రూ.46 వేలు పలికిన గణేశుని లడ్డు

అబ్బాయిపేటలో కొలువుదీరిన గణేశునికి సమర్పించిన లడ్డూ రూ.46 వేలు పలికింది. గురుబెల్లి కుమారస్వామి ఈ లడ్డూను దక్కించుకున్నారు. గ్రామస్థులు, అర్చకులు దివాకరరావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం

నందిగాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దేవాంగుల వీధిలో గణపతి హోమం, సామూహిక కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు ఎం.రమేష్‌శర్మ, వంశీల పర్యవేక్షణలో కుంకుమార్చనలు, హోమం చేశారు. కవిటిఅగ్రహారం పాతకాలనీలో పురోహితులు బాబూరావు పర్యవేక్షణలో కుంకుమ పూజలు చేశారు. బెజ్జిపల్లి, దిమిలాడ, జల్లపల్లి, దేవళభద్ర, నర్సిపురం తదితర గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు.

రూ.62వేలకు లడ్డూ సొంతం


లడ్డూతో మనీషా, ఉత్సవ కమిటీ సభ్యులు

నందిగాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం గ్రామంలో వినాయకుని లడ్డూని వేలం వేయగా యలమంచిలి గ్రామానికి చెందిన తిర్లంగి మనీషా దంపతులు రూ.62వేలకు దక్కించుకున్నారు. జై గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 11 కిలోల లడ్డూ, ఏడు తులాల వెండి వినాయక విగ్రహాన్ని వేలం వేశారు. అనంతరం వినాయక నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు.

అయోధ్య బాలరాముని రూపంలో...

పాతపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నంలోని దువ్వార వీధిలో అయోధ్య బాలరాముని రూపంలో గణేశుడు పూజలు అందుకుంటున్నాడు. ఈ వినాయకుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. స్థానిక శ్రీ నీలమణిదుర్గ కాలనీ మూడో లైనులో లడ్డూకు వేలం వేశారు. పాడి కాలనీకి చెందిన లంక వలస పాపారావు రూ.20,500కు లడ్డూను సొంతం చేసుకున్నారు.


అయోధ్య బాల రాముని రూపంలో...


నరసన్నపేట: కొత్తవీధిలోని భారీ వినాయకుడు

లక్ష్మీ గణపతికి విశేష అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొండేటి వీధిలోని లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఆదివారం స్వామికి ముత్యాల హారం అలంకరించారు. విశేష పూజల అనంతరం ముత్యాలహారం, లడ్డూకు వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి రోడ్డులో...

ఇచ్ఛాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఆసుపత్రి రోడ్డులో భారీ గణనాథుని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. 16.5 అడుగుల భారీ వినాయక విగ్రహం వద్ద ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు.


లక్ష్మీగణపతికి ముత్యాల హారంతో అలంకరణ


పూజలందుకుంటున్న భారీ వినాయకుడు

విజేతలకు బహుమతులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సవరదేవిపేటలో వరసిద్ధి వినాయక మందిరం 55వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షలు ఆదివారం నిర్వహించారు. సుమారు 50 జట్లు పాల్గొనగా హరిపురం గీతాంజలి స్కూల్ ప్రథమ, హరిపురం జడ్పీ హెచ్ఎస్ ద్వితీయ, బెలగాం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు వరుసగా రూ.6,666, రూ.5,555, రూ.4,444 నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలను విజేతలకు అందించి ఎంఈవో కె.అప్పారావు, నిర్వాహకులను అభినందించారు.

ఘనంగా నిమజ్జనం

రణస్థలం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాపువీధి వినాయక నిమజ్జనంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు.


రణస్థలంలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

బహుమతి ప్రదానం


విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సోంపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధి వినాయక మండపం 34వ వార్షికోత్సవం సందర్భంగా ఎకువూరులో ఆదివారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హరిపురం గీతం స్కూల్ విద్యార్థులు ప్రథమ, హరిపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, నడుమూరు హైస్కూల్ విద్యార్థులు తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. స్థానిక వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బాల గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగింది. విజేతలకు నగదు, షీల్డ్‌లు అందజేశారు.

మబగాంలో క్విజ్ పోటీలు

పోలాకి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మబగాం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరయ్యారు. మాజీ సర్పంచ్ లక్ష్మణదాస్, నిర్వాహకులు ఆలేటి ఈశ్వర్, వానపల్లి రవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చంటి(ఫైల్)

నందిగాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం నౌపడ సమీప రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం కణితివూరు గ్రామానికి చెందిన కంచరాన షణ్ముఖ రావు అలియాస్ చంటి (40) మృతి చెందాడు. ఆయన మూలపేట పోర్టులో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆయనకు భార్య పూజిత, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. టెక్కలి వైసీపీ సమన్వయకర్త పేడాడ తిలక్, ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

మహిళా సాధికారికతకు ప్రభుత్వం కృషి:ఎమ్మెల్యే శిరీష


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారికతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో స్త్రీశక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతు వైసీపీ హయాంలో రాష్ట్రంలో మహిళలు అన్ని విధాలా నష్టపోయారని, వేధింపులకు గురయ్యారని గుర్తు చేశారు. వారికి రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలే మహారాణులని, వారికి కావాల్సిన సంక్షేమ కార్యక్రమాలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు నెరవేరిన వేళ మహిళల కళ్లల్లో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించిందని, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 30 శాతం రిజర్వేషన్ అమలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 67 లక్షల మంది తల్లులకు పిల్లల చదువుల కోసం రూ.15వేల చొప్పున మంజూరు చేశారని... ఉచిత సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి తమ ప్రభుత్వ ఘనత అని తెలిపారు. స్త్రీశక్తి విజయోత్సవ సభకు అధిక సంఖ్యలో మహిళలు హాజరై.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాస్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, ఎం.నరేంద్ర, బీజేపీ నాయకులు రామానందస్వామి, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పలాసరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వీరభద్రాపురం గ్రామానికి చెందిన తలగాపు శంకర రావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు శంకరరావు ఎమ్మెల్యే గౌతు శిరీష గన్‌మేన్‌గా విధులు నిర్వహించేవారు. ఇటీవల గోపాల పురానికి చెందిన యవ్వారి వైకుంఠరావు విద్యుత్‌షాక్‌తో మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమెతో పాటు ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, అవుగాన షణ్ముఖరావు ఉన్నారు.

వజ్రపుకొత్తూరులో...

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుణుపల్లి చెందిన మాగుపల్లి నాని మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. మృతుడి కుటుండబానికి అండగా ఉంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మ

జలుమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొమనాపల్లి, తిమడాం రోడ్డులో దొంపాక వద్ద ఆదివారం తెల్లవారు జామున చెట్టుకొమ్మ విరిగి రోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అల్లాడ మీదుగా శ్రీముఖలింగం వెళ్లే వాహనాలు దొంపాక వద్ద నిలిచిపోయాయి. స్థానికులు చెట్టుకొమ్మను తొలగించి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉచిత విద్యుత్‌ను వినియోగించేలా చూడండి

పలాస, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణేశ నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను వినియోగించుకునే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎన్.రామారావు సూచించారు. ఆదివారం మున్సిపల్ విద్యుత్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వీధి దీపాలకు వినియోగిస్తున్న లైన్లు కాకుండా విద్యుత్ శాఖకు చెందిన లైన్ల ద్వారా మండపానికి విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా సిబ్బంది సహకారం అందించాలని సూచించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుద్ధ జల ప్లాంట్


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగించే కాంప్లెక్స్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రయాణికులకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ, శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్ శర్మ, స్టేషన్ మేనేజర్ ఎం.ప్రసాదరావు, టీడీపీ నాయకులు పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, వెంకటరమణ, జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బస్టాండ్ దారిలో దుకాణాలు వద్దు


వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ

కాశీబుగ్గ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లే మార్గంలో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయవద్దని సీఐ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం చిరు వ్యాపారులతో ఆయన మాట్లాడారు. బస్సులు లోపలికి వెళ్లి..మళ్లీ వెనక్కి వచ్చేందుకు వ్యాపారుల వల్ల ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీనిని అందరూ అర్థం చేసుకోవాలని కోరారు. మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను లోపల పెట్టాలని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ఏకాదశ రుద్రపారాయణం


శివలింగాన్ని పూజించిన దృశ్యం


హాజరైన భక్తులు

జలుమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో సాయి భక్తులు ఆదివారం ఏకాదశ రుద్రపారాయణం నిర్వహించారు. సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి సన్మార్గంలో నడచుకోవడానికి వీలు పడుతుందన్నారు. సత్యసాయి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ స్వామివారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా మొదటగా మంగళగిరిలోను, రెండో విడత చీరాలలోను, మూడోసారి శ్రీముఖలింగేశ్వరాలయంలో ఏకాదశ రుద్రపారాయణం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్.సురేంద్ర, రాష్ట్ర మహిళ సేవాదళ్ సమన్వయకర్త శాంతి, రాష్ట్ర వేదాధ్యయన ఇన్‌చార్జి ఆర్.దుర్గాప్రసాద్, రాష్ట్ర సేవాదళ్ సహ సమన్వయకర్తలు విశ్వనాథరెడ్డి, డి.రాఘవరావు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర,జిల్లా పదాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే

శ్రీముఖలింగేశ్వర స్వామిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి విశిష్టత, ఆలయ శిల్ప కళ సంపద ఔన్నత్యాన్ని విశదపరిచారు. అనంతరం వారాహి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఈవో వాసుదేవరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, అచ్యుత, శివ, శ్రీకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, మండల కన్వీనర్ బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

సంతబొమ్మాళి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండలంలోని భావనపాడులో సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు పింఛన్లు పంపిణీ, స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.


కొరియర్ అదృశ్యం

(మూడో పేజీ తరువాయి)

గుప్త అదృశ్యం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఫిర్యాదులో మన్మథరావు పేర్కొన్నారు.

● నరసన్నపేటలో కొంతమంది బంగారం వ్యాపారుల అక్రమ వ్యాపారానికి కొరియర్‌గా గుప్త పనిచేస్తున్నారు. బంగారం వ్యాపారం ఇచ్చే నగదును ఎవరికీ అనుమానం రాకుండా తన కారులో తీసుకువెళ్లి.. విశాఖపట్నం, విజయవాడ ఒక్కోసారి తమిళనాడు నుంచి బంగారాన్ని తీసుకువచ్చి స్థానిక వ్యాపారులకు అప్పగిస్తూ ఉంటారు. అందుకు అక్రమంగా బంగారం వ్యాపారం చేసేవారు ఒక ట్రిప్‌నకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు ఇస్తుంటారు. ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించకుండా.. నరసన్నపేటలో కొంతమంది బంగారం వ్యాపారులు ఇలాంటి కొరియర్ల ద్వారా లావాదేవీలు సాగిస్తారు. ఈక్రమంలో ఒక హోల్‌సేల్ బంగారం ముఠా సభ్యులే గత నెల 26న రూ.2కోట్లు ఇచ్చి గుప్తను బంగారం కోసం పంపించినట్లు సమాచారం. పెద్దమొత్తం కారులో డ్రైవర్‌తో వెళ్లిన గుప్త.. తిరిగి కారును డ్రైవర్‌తో వెనక్కి పంపించడం.. సెల్‌ఫోన్ ఆర్టీసీ బస్సులో లభించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుప్త రూ.2కోట్లతో పరారీ అయ్యారా? లేదా కారుడ్రైవర్ పథకం ప్రకారం ఏమైనా చేశారా?.. అసలు ఏమి జరిగిందనేది చర్చనీయాంశమవుతోంది. ఈ సంఘటన విశాఖపట్నం దగ్గర జరిగిందని.. అందుకే విశాఖ పోలీసులే ఈ కేసు దర్యాప్తు చేయాల్సి ఉంటుందని స్థానిక పోలీసులు చెబుతున్నారు. కాగా గుప్త సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కాగా సొమ్ముతో గుప్త అదృశ్యమైనట్టు ఫిర్యాదులో పేర్కొనకపోవడం గమనార్హం.

భగవద్గీతతోనే పరిపూర్ణత


మాట్లాడుతున్న గీతానందసరస్వతి

కోటబొమ్మాళి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక పరిపూర్ణత సాధనకు భగవద్గీతను మించినది లేదని.. అందులోని ఏ ఒక్క శ్లోకాన్నయినా సగం చదివినా, విన్నా సద్గతులు కలుగుతాయని వరాహపురాణం చెబుతోందని గీతానంద సరస్వతి స్వామి అన్నారు. ఆదివారం ఊడికలపాడులో హనుమంతు వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సత్సంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి అప్పలనాయుడు, గంటా జగన్నాథంనాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నందిగాంలో భారీ వర్షం

నందిగాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో వీధుల్లో వరద ప్రవహించింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో పొలాలు, వీధుల్లో నీరుచేరింది.

● పోలాకి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి, రాళ్లపాడు, ముప్పిడి, ఈదులవలస గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వర్షం కురిసింది. పొలాల్లో నీరు నిలిచిపోయిందని.. పంట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు బాష ఎంతో ప్రఖ్యాతి కలిగినదని...దీనిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక రచయితల వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించారు. తెలుగు ఔన్నత్యాన్ని చాటేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచ స్థాయిలో చాటి చెప్పిన వైనాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం భమిడిపాటి గౌరీ శంకర్ రచించిన కథల సంపుటిని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభకనబరిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. రచయితల వేదిక అధ్యక్షులు సదాశివుని కృష్ణ, నిష్ఠల నర్సింహమూర్తి, డాక్టర్ గొలివి మోహన్, రాణీమోహన్, సాసుపల్లి కృష్ణబాబు, గొద్దు చిట్టిబాబు, బైరి భాస్కరరావు, బగ్గు గోవిందరావు, మెయ్య హరి, గొలివి రామారావు, హరి, రూపావతి పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

హిరమండలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ వి.లక్ష్మణరావు ఉత్సవ కమిటీలకు సూచించారు. ఆదివారం హిరమండలం పోలీసు స్టేషన్‌ను తనిఖీ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతంలేకుండా చూడాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాల్లో గొడవలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.